# వైఎస్ఆర్-అన్నమయ్య

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

సోమవారం 26 ఆగష్టు 2024


## మాదిగల ఆత్మీయ సదస్సులో పాల్గొన్న రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖామంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



**రాయచోటి, ఆగస్టు 25, ప్రభాతవార్త:**

రాయచోటి పట్టణం బస్టాండు సమీపంలోని ఎన్జీవో హోంలో ఆదివారం జరిగిన మాదిగల ఆత్మీయ సదస్సు కార్యక్రమంలో రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖామంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖామంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ మాదిగల రిజర్వేషన్లకు ఎలాంటి భంగం కలగకుండా ఎమ్మార్పీఎస్‌కు కేటాయించిన ఉద్యోగాలు మీకే దక్కేటట్లు చర్యలు చేపడతామన్నారు. మాదిగల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందన్నారు. రాబోయే రోజుల్లో రాయచోటి పట్టణంలో డా.బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు తమ వంతు కృషి చేస్తానని మంత్రి వారికి హామీ ఇచ్చారు.

## పాముకాటుతో మహిళా రైతు మృతి

### జమ్ముకుంటపల్లెలో విషాదం

**మదనపల్లెక్రైం, ఆగస్టు 25 ప్రభాతవార్త :**



పొలంపనుల చేసున్న మహిళా రైతును పాము కాటేసి మృత్యువాత పడ్డ విషాదకర ఘటన మదనపల్లె మండలంలో కలకలం రేపింది. మృతురాలి కుటుంబీకుల కథనం మేరకు మదనపల్లె మండలం చికిలుబైలు పంచాయితీ జమ్ముకుంటపల్లెకు చెందిన బాపనపల్లె రాజశేఖర్ భార్య కవిత (33) రోజులాగానే ఆదివారం కూడా గ్రామానికి సమీపాన ఉన్న తన వ్యవసాయ పొలం వద్దకు వెళ్ళింది. పొలం పనులు చేస్తున్న కవిత కాలుపై విషసర్పం కాటేసింది. వెంటనే కుటుంబీకులు ఆమెను మదనపల్లెకు తీసుకువస్తుండగా దారిలోనే మృతి చెందింది. ఆసుపత్రి అత్యవసర విభాగం డాక్టర్లు ఆమెను పరీక్షించి మార్గమద్యంలోని చనిపోయిందని చెప్పడంతో కవిత కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతురాలికి ఇద్దరు కుమార్తెలు కలరు. కవిత మృతితో జమ్ముకుంటపల్లెలో విషాదఛాయలు అలముకొన్నాయి.

# రైతుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయం

### - మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి





**గాలివీడు, ఆగస్టు 25(ప్రభాతవార్త):**

రైతుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని వారి అభివృద్ధికి అనేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని రాష్ట్ర రవాణా యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని పేరంపల్లి పంచాయతీ కరణం రెడ్డివారిపల్లెలో మాజీ మండల ఉపాధ్యక్షులు గీదర ఈశ్వరరెడ్డి కుమారులు ధర్మారెడ్డి, నాగభూషణ్‌రెడ్డి ఇచ్చిన విందు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రంలో చాలా వరకు రైతుల భూములు కబ్జాలకు గురయ్యారని తెలిపారు. వైసీపీ నాయకులు వారికి తోచిన విధంగా ప్రభుత్వ భూములను ప్రైవేట్ భూములను ఆక్రమించుకున్నారని తెలిపారు. రైతుల భూసమస్యలను పరిష్కరించడానికి త్వరలో రెవెన్యూ సదస్సులను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. రైతులందరూ భూ సమస్యలను రెవెన్యూ సదస్సులలో అధికారులకు వివరిం చాలని పేర్కొన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి గ్రామ పంచాయతీలను బలోపేతం చేయడానికి రాష్ట్ర వ్యాప్తంగా ఒకే రోజు గ్రామసభలను ఏర్పాటు చేసి గ్రామాలకు సంబంధించిన అభివృద్ధి పనులను గుర్తించడం జరిగిందన్నారు. గ్రామాల అభివృద్ధికి నిధులను కూడా మంజూరు చేయడం జరిగిందన్నారు. ఉపాధి నిధులతో అన్ని గ్రామ పంచాయతీలలో సీసీ రోడ్ల నిర్మాణంతో పాటు డ్రైనేజీ తదితర మౌలిక వసతుల అభివృద్ధికి కృషి చేయడం జరుగుతుందన్నారు. అనంతరం మాజీ ఎంపీపీ వెంకటనారాయణరెడ్డి ఇచ్చిన తేనీటి విందు కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ నాయకుడు మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి, పూలికుంట సర్పంచ్ పార్థసారథిరెడ్డి, మాజీ సర్పంచులు మహమ్మద్‌రియాజ్, ఫరీద్‌బాషా, శ్రీనివాసరాజు, భద్రప్పనాయుడు, ప్రభాకర్‌నాయుడు, మాజీ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు కేడెం లక్ష్మయ్య, టీడీపీ నాయకులు వెంకటరమణారెడ్డి, రామమోహన్‌నాయుడు, రమణారెడ్డి, వీరరాఘవులు, మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

## తెలుగుభాష దినోత్సవం ఘనంగా నిర్వహించాలన్న జిల్లా కలెక్టర్







**ముద్దనూరు, ఆగస్టు 25, ప్రభాతవార్త:**

యర్రగుంట్ల మండలంలోని కలమల్ల గ్రామంలో శ్రీ లక్ష్మి చెన్నకేశవ స్వామి ఆలయంలో ప్రాధాన్యంలో క్రీస్తు శకం 575వ సంవత్సరంలో రేనాటి చోళవరాజులు, ధనుంజయ వర్మ వేయించిన శాసనాలను ఆదివారం నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ పరిశీలించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ 1904లో మద్రాసు శాసన పరిశోధన విభాగం వారు దీనిని గుర్తించారని, 1947-48లో ఆచార్య కె.నీలకంఠ శాస్త్రీ యమో.వెంకట రామయ్య ఈ శాసనాన్ని పరిశీలించి ముద్రించారని అన్నారు. ఆగస్టు 29న గిడుగు రామ్మూర్తి పంతులు జయంతిని పురస్కరించుకొని తెలుగు భాష దినోత్సవం ఘనంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. విద్యాశాఖ అధికారులు, పంచాయతీ రాజ్ శాఖ, ఎండోమెంట్, ఇంట్యాక్ గ్రామస్థులు అందరి సహకారంతో మంచి సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించడానికి ఏర్పాటుచేయడమైనదని, అంతేకాకుండా తెలుగుభాష ఔన్నత్యాన్ని చాటి చెప్పిన వారు చాలా మంది ఉన్నారని వారిలో జిల్లాలో సుమతి శతకం రచించిన వారైతేనేమి, కుమార సంభవం రచించిన నందిని, వేమన అన్నమాచార్య, తరిగొండ వెంగమాంబ వీరందరిని గుర్తు చేసుకుంటూ, అలాగే శ్రీ కృష్ణ దేవరాయల గురించి తెలిపే సాంస్కృతిక నాటికను ఇంట్యాక్ వారి ఆధ్వర్యంలో ప్రదర్శిస్తారని తెలిపారు. జిల్లాలో ఇటీవలి కాలంలో తెలుగు భాషలో చాలా మంది కవులు కవితలు రచించారని అందులో అయిదుగురు రచయితలను ఎన్నుకొని వారిని సన్మానించుకోవడం జరుగుతుందన్నారు. కలమళ్ల గ్రామం చుట్టూ ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రైవేట్ పాఠశాలలోని 8,9,10వ తరగతి విద్యార్థులను ఈ కార్యక్రమానికి హాజరు అయ్యే విధంగా చూడాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి అనురాధ, ఎమ్మార్వో శోభన్ బాబు, ఎంపీడీఓ భాగ్యలక్ష్మి, కలమల్ల ఎస్ఐ తిమోతి, మండల విద్యాశాఖ అధికారి శివప్రసాద్, పంచాయతీ రాజ్ అసిస్టెంట్ ఇంజనీర్, ఇంట్యాక్ అధికారులు, పంచాయతీ కార్యదర్శి సాంబశివారెడ్డి, విఆర్ఓ ఆంజనేయులు, కలమల్ల గ్రామస్థులు ఇల్లూరు పద్మనాభ రెడ్డి, పొన్న శివయ్య తదితరులు పాల్గొన్నారు.

## 10మంది జూదరులు అరెస్ట్

**దువ్వూరు, ఆగస్టు 25, ప్రభాతవార్త:**



మండల పరిధిలోని నేలటూరు గ్రామ సమీపంలో జూదం ఆడుతున్న 10మందిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.17200లు నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వినోద్‌కుమార్ తెలిపారు. ముందుగా రాబడిన సమాచారం మేరకు ప్రొద్దుటూరు, నేలటూరు తదితర ప్రాంతాలకు చెందిన వ్యక్తులు జూదం ఆడుతున్నారని సమాచారం రావడంతో సిబ్బందిచే దాడి చేశామన్నారు. ఈ దాడులలో 10మందిని అరెస్ట్ చేసి వారి వద్దనుంచి 17200నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరిని త్వరలో మైదుకూరు కోర్టుకు హాజరుపరుస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## ప్రజా దర్బార్ ద్వారా ప్రజల సమస్యలు అక్కడికక్కడే పరిష్కారం

### మంత్రి రాంప్రసాద్‌రెడ్డి



**చిన్నమండెం, ఆగస్టు 25, ప్రభాతవార్త :**

ప్రజా దర్బార్ కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలు అక్కడికక్కడే పరిష్కరించడం జరుగుతుందని రాష్ట్ర రవాణా, యువజన క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం చిన్నమండెం మండలం బోరెడ్డిగారిపల్లెలోని తమ నివాసం నందు ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ఎన్నో ఏళ్లుగా రాయచోటి ప్రాంతంలో సమస్యలు పరిష్కారానికి నోచుకోక ప్రజలు నానా ఇబ్బందులు ఎదుర్కొనే వారని, ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రజా దర్బార్ కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యల పరిష్కారానికి శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. అన్నమయ్య జిల్లాలో ఎక్కువగా గత ప్రభుత్వంలో జరిగిన అక్రమాలు, భూ కబ్జాలు మీద అధికంగా ఫిర్యాదులు వస్తున్నాయని, వీటిపై ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులకు ఫోన్ చేసి సమస్యలు పరిష్కరించడం జరుగుతుందని మంత్రి పేర్కొన్నారు. మంత్రి జిల్లాకు వచ్చినప్పటి నుంచి నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలు పరిష్కరిస్తున్నారు. అంతే కాకుండా ఎల్లవేళ్లలా ప్రజలతో మమేకమై వారిని అప్యాయంగా పలకరిస్తూ సమస్యలు అక్కడిక్కడే పరిష్కారం చూపడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## వేరుశెనగ సాగుపై అనాసక్తి టమోటా సాగుపై ఆసక్తి


వార్త 2వ పేజీలో...


## ప్రతి మహిళ లక్షాధికారి కావాలన్నదే ప్రభుత్వ లక్ష్యం

### - డీఆర్ఓ సత్యనారాయణరావు



**రాయచోటి, ఆగస్టు 25, ప్రభాతవార్త:**

స్వయం సహాయక సం ఘంలోని ప్రతి మహిళ లక్షా ధికారి కావాలన్నది ప్రభుత్వ లక్ష్యమని డీఆర్ఓ సత్యనారా యణరావు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆది వారం రాయచోటి కలెక్టరేట్ లో సభాభవన్ నందు డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో జరిగి న ప్రధాన మంత్రి లక్పతి దీదీ ఫెలిషిటేషన్ ముఖాముఖి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఆర్వో సత్యనారాయణరావు మాట్లాడుతూ ప్రభుత్వం మహిళా సంక్షేమానికి ఎంతగానో తోడ్పాటు అందిస్తున్నదని తెలిపారు. ఇందులో భాగంగా స్వయం సహాయక సంఘాలోని మహిళలకు బ్యాంకు రుణాలను, రివాల్వింగ్ ఫండ్, సీఐఎఫ్ నిధులను అందించడం జరుగుతోందన్నారు. ప్రతి మహిళా ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ఉపయోగించుకొని లక్ష్యాధికారిగా తయారు కావాలని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. అనంతరం జిల్లా నలుమూలల నుంచి కార్యక్రమానికి వచ్చిన మహిళలకు జిల్లా వ్యాప్తంగా 762 సంఘాలకు రూ.94.58 కోట్ల బ్యాంకు రుణాలు మరియు రివాల్వింగ్ ఫండ్ మెగా చెక్కును అందించారు. అలాగే వీరబల్లి మరియు చిట్వేలి మండలాలకు రూ.20లక్షల సీఐఎఫ్ నిధులను కూడా అందించారు. ఈ సందర్భంగా ఆర్థికంగా మహిళలు అభివృద్ధి చెందేందుకు మరియు మహిళా సాధికారత సాధించేందుకు ఎంతగానో తోడ్పాటు అందిస్తున్న ప్రభుత్వానికి మహిళలు తమ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ సత్యనారాయణ, వారి సిబ్బంది, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదం జరిగితేనే స్పందిస్తారా..?



**ఖాజీపేట, ఆగస్టు 25, ప్రభాతవార్త:**

ఏదైనా ప్రమాదం జరిగితేనే స్పందిస్తారా..ముందుగా మేలుకోరా అని పలువురు విద్యుత్ శాఖ అధికారులను ప్రశ్నిస్తున్నారు. మండల కేంద్రమైన ఖాజీపేట గౌతమ్ స్కూల్ ప్రక్కన ప్రధాన రహదారి పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచె లేకుండా ప్రమాదకరంగా ఉంది. ఈ ప్రధాన రహదారిలో ఉండే ట్రాన్స్‌ఫార్మర్లకు ఒక్క ట్రాన్స్‌ఫార్మర్‌కు కూడ కంచె లేదు. అలాగే పత్తూరులో మండల ప్రాథమిక పాఠశాల ఎదురుగా ఉన్న ట్రాన్స్‌ఫారంకు కూడ కంచె లేదు. ఈ ట్రాన్స్‌ఫార్మర్ పక్కనే నివాసాలు ఉన్నాయి. ఒకవైపు రోడ్డు, మరోవైపు ప్రజల ఇళ్లు ఉండడమే కాక నిత్యం వాహణాలు తిరుగుతున్న ప్రదేశం కావడంతో స్థానికుల్లో భయాందోళనలు నెలకొన్నాయి. ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచె ఏర్పాటుచేస్తే ఎలాంటి ప్రమాదం జరగకుండా ఆపవచ్చని స్థానికులు హర్శిస్తున్నారు. పశువులు వంటి మూగజీవాలు అటువైపు వెళుతుంటాయని, అంతేకాక చిన్న పిల్లలు పొరపాటున అటు వెళితే ప్రమాదం జరిగే అవకాశం ఉందని హడలిపోతున్నారు. ఎటువంటి ప్రమాదం జరగకుండా ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచెను ఏర్పాటుచేయాలని ప్రజలు కోరుతున్నారు.

# తంబళ్లపల్లెలో మరో మారు డెంగీ పంజా

### - గుండ్లపల్లిలో రెండు పాజిటీవ్ కేసులు - మొక్కుబడిగా వైద్య సేవలు

### - నిధులు లేక ముఖం చాటేస్తున్న సర్పంచులు

**తంబళ్లపల్లె, ఆగస్టు 25, ప్రభాతవార్త:**

తంబళ్లపల్లె మండలంలో రెండు వారాల క్రితం తంబళ్లపల్లె మండల కేంద్రంలో మూడు డెంగీ కేసులు నమోదయ్యాయి. తిరుపతి, బెంగళూరులో చికిత్సలు చేయించుకున్న సంఘటన మరుకవనే మండలంలో మరో రెండు డెంగీ పాజిటీవ్ కేసులు నమోదుతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. నమోదైన చోట ఏదో మొక్కుబడిగా వైద్య సేవలు అందించి మ..మ అనిపించగా మలేరియా అధికారులు అలా వచ్చి ఇలా పిచికారి చేసి ఫొటోలు దిగి పోతుండగా గ్రామ సర్పంచులు పారిశుద్ధ్య నివారణ చర్యలు చేపట్టడానికి చేతిలో చిల్లిగవ్వలేక అధికారుల బారి నుంచి తప్పించుకు తిరగకతప్పడం లేదు. తంబళ్లపల్లె మండలం గుండ్లపల్లె పంచాయతీ దిగువపల్లెలో గత 3 రోజుల క్రితం ఓ డెంగీ కేసు నమోదు కాగా శనివారం అదే గ్రామానికి చెందిన మాధవరెడ్డి(36) డెంగీ జ్వరంతో తంబళ్లపల్లె సీహెచ్‌సీని ఆశ్రయించాడు. మాధవరెడ్డికి డెంగీ పాజిటీవ్ ఉన్నట్లు మెడికల్ అధికారి వెంకటరామయ్య గుర్తించి వెంటనే ఆయనకు ప్రత్యేక చికిత్స అందించాలని ఆదివారం డా.రిచర్డ్‌ను పురమాయించారు. మండలంలో మరో మారు డెంగీ డెంగీ కేసులు బయటపడుతుండడంపై ఆయన స్పందిస్తూ ఈ డెంగీ వ్యాధి ప్రాణాంతకమని నిర్లక్ష్యం చేస్తే ప్రాణాపాయం తప్పదన్నారు. ముందస్తుగా జిల్లా స్థాయితో పాటు అన్ని శాఖల అధికారులు స్పందించి డెంగీ నివారణపై చర్యలకు స్పందించాల్సి ఉందన్నారు. డెంగీ సోకిన గ్రామంలో మాత్రమే వైద్య సేవలు, పారిశుద్ధ్య పనులు చేపట్టడం కన్నా మండలం మొత్తం మూకుమ్మడిగా సమిష్టిగా ఇంటింట ఫీవర్ సర్వేతో డెంగీ వ్యాధిని గుర్తించి పూర్తి స్థాయిలో నివారణ సాధ్యమవుతుందని అభిప్రాయపడ్డారు. ఈ సర్వేలో భాగంగా గ్రామాల్లో పారిశుద్ధ్యం, తాగునీటి కాలుష్యం, వ్యక్తిగత పరిశుభ్రత చేపడితే డెంగీమహమ్మారిని



మండలం నుంచి తరిమికొట్టవచ్చని అందుకు వైద్య సిబ్బందికి గ్రామ సర్పంచులు, సచివాలయ సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, పాఠశాల అధ్యాపకులు, ప్రజలు సహకారం అందించాల్సి ఉందన్నారు.

# ఉన్నత ఆశయాలతో ముందుకు సాగాలి

–సంస్థ కరస్పాండెంట్ దౌలత్‌ఖాన్

–హెలెన్ కెల్లర్ సంస్థ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**వైవీయూ, ఆగస్టు 25, ప్రభాతవార్త:**

ప్రతి ఒక్కరు ఉన్నత ఆశయంతో ముందుకు సాగుతూ అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలని హెలెన్ కెల్లర్ సంస్థల జనరల్ సెక్రటరీ, కరస్పాండెంట్ డాక్టర్ పి. దౌలత్‌ఖాన్ అన్నారు. ఆదివారం హెలెన్ కెల్లర్ బధిరుల ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన కరస్పాండెంట్ దౌలత్‌ఖాన్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి ప్రతిభ ఉంటుందని ఆ దిశగా అడుగులు వేస్తే జీవితంలో ఉన్నతంగా స్థిరపడవచ్చునని విద్యార్థులకు సూచించారు. ఈ హెలెన్ కెల్లర్ విద్యా సంస్థలను 1984 స్థాపించామన్నారు. ప్రిన్సిపల్ ఎం. మసుద బేగం మాట్లాడుతూ బధిర, చెవిటి, మూగ విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపాలనే ఉద్దేశంతో ఈ సంస్థను స్థాపించారని తెలియజేశారు. ఈ సంస్థలో చదివి 70 మంది ప్రభుత్వ ఉద్యోగాలు పొందారన్నారు. అదే విధంగా 250 మందికి పైగా ప్రైవేట్ సంస్థలో పనిచేస్తున్నారన్నారు. ఈ సమావేశంలో బధిర విద్యార్థులు, వారి కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



# రైతులను వేధిస్తున్న యూరియా కొరత

**దువ్వూరు, ఆగస్టు 25, ప్రభాతవార్త:**



మండలంలో కేసీ కాలువ, తెలుగుగంగ అలాగే కుందూ నది పరివాహక ప్రాంతాలలో వ్యవసాయ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా రైతులు ఈ ఏడాది ఎక్కువ విస్తీర్ణంలో వరి సాగు చేసేందుకు సిద్ధం అవుతున్నారు. ప్రస్తుతం గోట్టపు బావుల కింద కుందూ నది పరివాహక ప్రాందాలైన కానగూడూరు, పెద్దజొన్నవరం, నేలటూరు, మాసనపల్లె గ్రామాల్లో వరి నాట్లు వేస్తున్నారు. వరి నాటు వేసే సమయంలోను అలాగే వరి నారుమడి పెంచే సమయంలోనూ రైతులకు యూరియా అవసరం ఉంటుంది. ప్రస్తుతం దువ్వూరు మార్కెట్‌లో యూరియా అందుబాటులో లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. గత వారం రోజుల నుండి మండలంలో యూరియా దొరకక పోవడంతో చాగలమర్రి, ప్రొద్దుటూరు ప్రాంతాలకు వెల్లి యూరియాను రైతులు తెచ్చుకుంటున్నారు. 10రోజుల క్రితం రైతు సేవా కేంద్రాలకు కొద్ది కొద్దిగా యూరియా కేటాయించారు. రైతు సేవా కేంద్రాల్లో యూరియా అయిపోవడంతో సమస్య మళ్లీ మొదటికి వచ్చింది. కొంతమంది దువ్వూరు మండలానికి కేటాయించిన ఇతర మండలాలకు తరలిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. వాటిని కట్టడి చేయవలసిన అవసరం వ్యవసాయ శాఖపై ఉంది. ప్రస్తుతం రసాయనిక ఎరువుల కొరతలు లేదని చెప్పవచ్చును. కాంప్లెక్స్ ఎరువులు సమృద్ధిగా లభిస్తున్నాయి. యూరియి మాత్రమే రైతులకు అభించకపోవడంతో అవస్థలు పడుతున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు యూరియాను రైతు సేవా కేంద్రాలలోకి అందుబాటులో ఉంచాలని రైతులు కోరుతున్నారు.

# ట్రాఫిక్ సమస్యతో ఆటో డ్రైవర్లకు రక్షణ కరువు

ఏఐటీయూసీ మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రామయ్య



**ప్రొద్దుటూరు, ఆగస్టు 25, ప్రభాతవార్త:**

ప్రొద్దుటూరు పట్టణంలో దాదాపు 6వేల మంది ఆటోడ్రైవర్లు స్వయం ఉపాధిగా ఆటోలు నడుపుకుంటున్నారని అయితే వీరికి ప్రభుత్వ పరంగా, సామాజికంగా రక్షణ కరువైందని ఏఐటీయూసీ మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రామయ్య అన్నారు. ఆదివారం స్థానిక పెన్నానగర్ ఏఐటీయూసీ కార్యాలయంలో ఆటో డ్రైవర్ల యూనియన్ పట్టణ అధ్యక్షులు వై.హరి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తెచ్చిన వాహణదారుల చట్టాల కింద అధిక మొత్తంలో చలానాలను స్వయం ఉపాధి కలిగిన డ్రైవర్లపై వసూళ్లకు సిద్ధమవుతోంది తప్ప ఆటో డ్రైవర్ల సంక్షేమం కోసం పాటుపడే ప్రణాళికలను రూపొందించకపోవడం శోచనీయం అన్నారు. టౌన్‌ప్లానింగ్ అధికారుల నిర్లక్ష్యం మూలంగా మాస్టర్ ప్లాన్ అమలు పరచక పట్టణంలో పద్మవ్యూహంలా మార్చారని ఫలితంగా ప్రజలు వారి అవసరాల నిమిత్తం పట్టణంలో తిరగాలంటే ఆటోలలో వెల్లడానికి వీలు లేకుండా కష్టతరంగా మారిందన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు మాట్లాడుతూ ఆటో, లారీ తదితర రవాణాకు సంబంధిత డ్రైవర్లపై ఎఫ్సి, పొల్యూషన్ సర్టిఫికెట్, ఇన్సూరెన్స్ వంటి వాటిని ఏడాదికోమారు సవరణలు చేస్తూ అధిక మొత్తంలో వసూళ్లు చేస్తున్నారన్నారు. ఆటోడ్రైవర్ల మరియు కార్మికుల సంక్షేమానికి నిధుల కల్పన లేదని ఆటో మొబైల్ రంగంలో పనిచేసే కార్మికులంతా ఏకమై ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ పట్టణ ఉపాధ్యక్షులు రమేష్ రెడ్డి, మాబు, దౌలా, కార్యదర్శి మచ్చా శ్రీను, సురేంద్ర, ఎల్లయ్య, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

# కోనేటి కృష్ణ ప్రదీప్ రెడ్డి ఆధ్వర్యంలో 100మంది బిజెపిలో చేరిక



**ప్రొద్దుటూరు, ఆగస్టు 25, ప్రభాతవార్త:**

ప్రొద్దుటూరు నియోజకవర్గం ప్రజలు సుమారు 100మంది బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి కోనేటి కృష్ణ ప్రదీప్ రెడ్డిఆధ్వర్యంలో జిల్లా బిజెపి అధ్యక్షులు వంగల శశిభూషన్ రెడ్డి సమక్షంలో భారతీయ జనతా పార్టీలో చేరారు. ఆదివారం దొరసానిపల్లెలోని గోపికృష్ణ విద్యాసంస్థల ఆవరణంలో ఏర్పాటుచేసిన బారతీయ జనతా పార్టీ జిల్లా వ్యాప్తంగా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సంధర్భంగా స్థానిక బిజెపి నాయకులు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో 100మంది బిజెపి తీర్థం పుచ్చుకున్నారు. కేంద్ర ప్రభుత్వంలోని ప్రధానమంత్రి నరేంద్ర మోడి దేశ అభివృద్ధి సంక్షేమ పథకాలకు ఆకర్శితులై తాము భారతీయ జనతా పార్టీలో చేరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు గురుస్వామి, రవి, చలపతి రావు, వంకధార నరేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి జిల్లాలో బలోపేతం చేసే దిశగా సభ్యత్వ నమోదు

జిల్లా బిజెపి అధ్యక్షులు వంగళ శశిభూషన్ రెడ్డి



**ప్రొద్దుటూరు, ఆగస్టు 25, ప్రభాతవార్త:**

వైఎస్సార్ కడప జిల్లాలో భారతీయ జనతాపార్టీ బలోపేతం చేసే దిశగా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టామని బిజెపి జిల్లా అధ్యక్షులు వంగళ శశిభూషన్ రెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక గోపికృష్ణ విద్యాసంస్థల ఆవరణంలో ఏర్పాటుచేసిన భారతీయ జనతాపార్టీ సభ్యత్వ నమోదు అభియాన్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ భక్తి దేశ అభివృద్ధి కోసం ప్రపంచంలో భారతదేశాన్ని విశ్వ గురువుగా నిలిపేందుకు బిజెపి ఆవిర్భవించింది అన్నారు. ప్రపంచ దేశ రాజకీయ పార్టీలలో బిజెపి అతి పెద్ద పార్టీగా నిలుచున్ననూ దేశంలో ఎక్కువ ప్రజాప్రతినిధులు ఉన్న పార్టీగా బీజేపి అగ్రస్థాణంలో ఉందన్నారు. ముచ్చటగా మూడోసారి కేంద్రంలో ప్రధాని నరేంద్రమోడి నాయకత్వంలో అధికారం చేపట్టిందని తెలిపారు. అలాంటి బిజెపి పార్టీ 9ఏళ్లకు ఓసారి నిర్వహిస్తామని, ప్రతి మూడేళ్లకు పునరుద్ధరిస్తామని తెలిపారు. ఈ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం సెప్టెంబర్ 1వ తేది నుండి మొదలై సుమారు 40రోజుల పాటు కొనసాగుతుందన్నారు. జిల్లాలో రెండు లక్షల మంది సభ్యత్వం నమోదు లక్ష్యంగా పనిచేస్తామన్నారు. పోలింగ్ బూతలు, వార్డు, మండల, నియోజకవర్గ వారీగా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపడతామన్నారు. వంద మందిని సభ్యులుగా చేర్చిన నాయకులకు క్రియాశీలక సభ్యత్వం అన్నారు. సభ్యత్వ కార్యక్రమం ఎలా నిర్వహించాలో బిజెపి శ్రేణులకు ఆయన దిశా నిర్దేశం చేశారు. జిల్లా వ్యాప్తంగా చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమానికి గోపికృష్ణ విద్యాసంస్థల ఆవరణ వేదిక కావడం సంతోషంగా ఉందని ఈ సంధర్భంగా అవకాశం కల్పించిన బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి కోనేటి కృష్ణ ప్రదీప్ రెడ్డికి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశానికి రాష్ట్ర బిజెపి ప్రధాన కార్యదర్శి రాయలసీమ జోనల్ ఇంచార్జ్ బిట్రా శివన్నారాయణ, జిల్లా బిజెపి ఇన్చార్జి డి.వెంకటేశ్వర రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లక్ష్మి నాఆరయణ రెడ్డి, బద్వేలు బిజెపి అభ్యర్థి బొజ్జ రోషన్న, జిల్లా మాజీ అధ్యక్షుడు శ్రీనాథ్ రెడ్డి, బీరం విద్యాసంస్థల అధినేత బీరం సుబ్బారెడ్డి, బిజెపి పట్టణ అధ్యక్షులు వంకధార నరేంద్రరావు, బిజెపి నాయకులు గురుస్వామి, రవిశంకర్, చలపతి, మరియు జిల్లాలోని ఇతర నియోజకవర్గాల నుంచి పెద్దఎత్తున బిజెపి నాయకులు పాల్గొన్నారు.

# జిల్లా అథ్లెటిక్స్ పోటీలు విజయవంతం



**ప్రొద్దుటూరు అర్బన్, ఆగస్టు 25, ప్రభాతవార్త:**

బాషా అథ్లెటిక్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ మైదానంలో అండర్ 14, 16 బాల, బాలికలకు జిల్లా స్థాయి అథ్లెటిక్ పోటీలు నిర్వహించారు. ఇందులో జిల్లా నలుమూలల నుండి 300మంది క్రీడాకారులు పాల్గొన్నారు. అండర్ 14 బాల, బాలికలకు ట్రైయాథ్లాన్ ఏ, ట్రైయాథ్లాన్ బి, ట్రైయాథ్లాన్ సీ, కిడ్స్ జావెలిన్ అండర్ 16 బాల బాలికలకు 60మీ, 600మీటర్లు లాంగ్ జంప్, హై జంప్, షాట్ పుట్, జావలిన్ త్రో క్రీడాంశాలలో పోటీ నిర్వహించారు. ఈ క్రీడల్లో ప్రతిభ కనబరిచిన మొదటి, ద్వితీయ, స్థానాల్లో గెలుపొందిన క్రీడాకారులను సెప్టెంబర్ నెల 14, 15, 16తేదీలలో ఆచార్య నాగార్జున యూనివర్సిటి గుంటూరులో జరగబోయే ఏపీ స్టేట్ జూనియర్ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్‌కు జిల్లా జట్టుకు ఎంపికయ్యారు. ఈ క్రీడల నిర్వహణలో వ్యాయామ సంచాలకులు పి.వెంకటసుబ్బయ్య, సునీల్, శివారెడ్డి, ఎర్రన్న, రాఘవేంద్రా, అంకారావు, నాగేశ్వరరావు, రామచంద్రుడు, అనిల్, ఖాదర్ రెడ్డి, దిలీప్, మురళీ, నాగేశ్వరరావు, మరియు సీనియర్ క్రీడాకారులు రఫీ, రబ్బాని సహకరఇంచారని వారందరికి నిర్వాహకులు అహ్మర్ బాషా, కార్యదర్శి బాషా అథ్లెటిక్ ఫౌండేషన్ ధన్యవాదాలు తెలిపారు.

# అసాంఘీక కార్యకలాపాలపై ఉక్కు పాదం

రాజంపేట డీఎస్పీ నాంపల్లి సుధాకర్



**రాజంపేట అర్బన్, ఆగస్టు 25, ప్రభాతవార్త:**

రాజంపేట సబ్ డివిజన్‌లో అసాంఘీక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతామని నూతన డీఎస్పీ నాంపల్లి సుధాకర్ అన్నారు. డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే డిప్యూటి సీఎం పవన్‌కళ్యాన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. మొదటిసారిగా మీడియాతో మాట్లాడుతూ సబ్ డివిజన్‌పై అవగాహణ ఉందన్నారు. అన్ని స్టేషన్లు తనిఖీ చేసిన అనంతరం మరింత క్లారిటి వస్తుందని అన్నారు. ఇప్పటికే అన్ని స్టేషన్లల బాధ్యులు మాట్లాడారని, వారికి దిశానిర్దేశం చేయడం జరిగిందన్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు శాంతి భద్రతల పర్యవేక్షణ కోసం అంకిత భావంతో పనిచేస్తామన్నారు. మట్కా, జూదం, గంజాయి వంటి అసాంఘీక కార్యకలాపాల విశయంలో కఠినంగా వ్యవహరిస్తామన్నారు. ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకంటామన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు సంబంధించి తనకు నేరుగా అయినా సమాచారం ఇవ్వాలని కోరారు.

# లయన్స్ క్లబ్ కొత్త జిల్లా గవర్నర్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు



**రాజంపేట అర్బన్, ఆగస్టు 25, ప్రభాతవార్త:**

లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ 324–డి గవర్నర్ ఎం.గౌతమ్ ఆధ్వర్యంలో విస్తృతంగా సేవా కార్యక్రమాలు రాజంపేట క్లబ్ పరిధిలో చేపడతామని సీనియర్ నేతలు పేర్కొన్నారు. ఆదివారం నెల్లూరులో జరిగిన సమావేశంలో అంతర్జాతీయ లయన్స్ డైరెక్టర్ గోపాల రామకృష్ణ క్యాబినేట్ మొత్తానికి ప్రమాణస్వీకారం చేయడం జరిగింది. ఈ సంధర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ రాజంపేట శాఖ గవర్నర్‌ను ఘణంగా సన్మానించి అభినందించడం జరిగింది. ఈ సంధర్భంగా క్లబ్ సభ్యులు మాట్లాడుతూ నూతన గవర్నర్ నాయకత్వంలో రాబోవు రోజుల్లో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించి ప్రజలకు మరింత సేవా కార్యక్రమాలు నిర్వహించి ప్రజలకు మరింత చేరువ అవుతామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా చైర్మెన్ పోతుగుంట రమేష్ నాయుడు, రీజన్ చైర్మెన్ గీతాంజలి, రమణ, లైన్స్ క్లబ్ అధ్యక్షులు నరసింహా రాజు, జోన్ చైర్మెన్ వై.సుబ్రమణ్యం రాజు, లైన్స్ క్లబ్ సీనియర్ నాయకులు పిడికెటి నాగేశ్వరరావు, షేక్ అబ్దుల్లా, క్లబ్ కోశాధికారి నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రారంభమైన శ్రీ కృష్ణాష్టమి వేడుకలు

**ప్రొద్దుటూరు, ఆగస్టు 25, ప్రభాతవార్త:**

స్థానిక శ్రీ కృష్ణాలయంలో ఆలయ కమిటి చైర్మెన్ చల్లా రాజగోపాల్ యాదవ్, పాలకమండలి సభ్యులు ఆధ్వర్యంలో ఆదివారం నుండి శ్రీ కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సంధర్భంగా తొలిరోజు ఉదయం 5గంటలకు సుప్రభాత సేవ, 8గంటలకు గణపతి, విష్వక్సేన పూజ, పుణ్యాహ వాచనం, పంచగవ్య ప్రాశన, రుత్విక్ వరునం, రక్షాబంధనం, దీక్షా స్వీకరణ, గరుడ కేతన, పతాకావిష్కరణ, గోపూజ, మండప ఆరాధన ప్రధాన కలశ స్థాపన, వేణుగోపాల స్వామికి పూజలు, అర్చనలు, మంగళహారతి, మంత్ర పుష్పం, తీర్థప్రసాద వితరణ, సాయంత్రం ప్రదోషకాల పూజ, అంకురార్పణ, అగ్ని ప్రతిష్టాపన, దీక్షా హోమం, ధ్వజారోహణము, మహామంగళ హారతి, వేదస్వస్తి, తీర్థప్రసాద వినియోగం కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలలో భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

# మెరిసిన ఆణిముత్యాలు

– పెండ్లిమర్రి మండలానికి వన్నెతెచ్చిన క్రీడాకారుడు



**పెండ్లిమర్రి, ఆగస్టు 25, ప్రభాతవార్త:**

అంతర్జాతీయ వాలీబాల్ పోటీలలో కడప జిల్లా తప్పిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన బి.శ్రీకాంత్ అనే విద్యార్థి క్రీడల్లో తమ నైపున్యాన్ని ప్రదర్శించి పెండ్లిమర్రి మండలానికి గుర్తింపు తెచ్చారంటే మన మండలలానికి గర్వకారణమని అటు తల్లిదండ్రులు, ఇటు ఉపాధ్యాయయులకు గౌరవాన్ని మంచి పేరును తీసుకొచ్చి క్రీడల్లో తన సత్తా చాటడం అభినందనీయమని మండల ప్రజలు హర్షద్వానాల మధ్య తెలిపారు. దేశానికి ఇలాంటి క్రీడాకారులు ఎంతో అవసరమని ఇలాంటి విద్యార్థులను మరింత నైపుణ్యం సాధించేలా శిక్షణ ఇస్తే ఇతర దేశాల్లో కూడా మంచి స్థానం తీసుకొస్తారని ప్రజలు అభిప్రాయపడ్డారు. అంతర్జాతీయ వాలీబాల్‌లో మురిసిన మూడు ఆణిముత్యాలలో ఒక ఆణిముత్యం కడప జిల్లా పెండ్లిమర్రి మండలం తిప్పారెడ్డిపల్లి గ్రామానికి చెందిన శ్రీకాంత్ మన ఆణిముత్యం. క్రీడల్లో మరింత ఉన్నత స్థాయికి రావాలని మనస్ఫూర్తిగా మల్లేశ్వర స్వామి దేవస్థానం తరుపున మాజజీ ఈవో శ్రీనివాసులు, టీడీపీ నేత సింగపూర్ రాజారెడ్డి, దేవస్థాన సిబ్బంది హర్షద్వానాలతో తెలిపారు.

# వేరుశెనగ సాగుపై అనాసక్తి టమోటా సాగుపై ఆసక్తి

ఘననీయంగా తగ్గిన వేరుశెనగ సాగు







**కురబలకోట, ఆగస్టు 25 ప్రభాతవార్త :**

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో వేరుశెనగ సాగు ఘననీయంగా తగ్గింది. అన్నమయ్య జిల్లాలోని పశ్చిమ మండలాల్లో వేరుశెనగను మొట్టభూముల్లో సాగు చేస్తారు. ఈ పంటను వర్షాధారంపై పండిస్తారు. వేరుశెనగ సాగు చేసిన దిగుబడులు రావని భావించిన రైతులు టమోటాపై ఆసక్తి చూపుతున్నారు. వేరుశెనగ సాగును గతంలో కాడి మడకల ద్వారా సాగు చేసేవారు. అవి రానురాను కనుమరుగు కావడంతో యంత్రాల ద్వారాసాగు చేయాల్సిన పరిస్థితి వచ్చింది. అంతేకాకుండా పెట్టుబడులుకూడా పెరగడంతో సాగు చేసేందుకు రైతులు విముఖత చూపుతున్నారు. ఎకరాపొలం దుక్కి చేయడానికి రూ.5వేలు ఖర్చు చేయాల్సి ఉంది. విత్తనాలు ఎకరాకు 20సేర్లు నుంచి 25సేర్లు వరకు విత్తనాలు విత్తాల్సి ఉంది. ఇందుకు రూ.6వేలు ఖర్చు అవుతుంది. డిఏపి మూడు బస్తాలు వేయాల్సి ఉంది. కూలీల ఖర్చు, పంటనూర్పిడి రూ.15వేలు వరకు వ్యయం చేయాల్సి ఉంది. వర్షాధారం కావడంతో కాయలు బాగా ముదిరే సమయంలో వర్షం పడకపోతే ఆశా వదిలివేయాల్సి వస్తొంది. దీనిని దృష్టిలో పెట్టుకొని రైతులు వేరుశెవనగ సాగు కన్నా టమోటా సాగుపైనే ఏడాది పొడవునా నాట్లు వేయడం జరుగుతోంది. ఇప్పటికే 20వేల హెక్టార్లలో టమోటా సాగు వివిధ దశల్లో ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. టమోటాలు మార్కెట్‌లో దిగుబడులను పట్టి ధరలు హెచ్చుతగ్గులుగా ఉంటున్నాయి. అయినా కాని రైతులు ఒక అదును పంట ధర లేకపోయినా, రెండవ అదును పంటకైనా ధరలు వస్తాయన్న ఆశతో అధికశాతం మంది రైతులు బోర్లు, చెరువుల కింద,వర్షాధారంతో మెట్టభూముల్లో కూడా సాగు చేస్తున్నారు. ఏది ఏమైనా వేరుశెనగ పంట కన్నా టమోటాపైనే అధికంగా రైతులు మక్కువ చూపుతున్నారు.

# కిచెన్ కింగ్ మసాల



**ఫలానా మసాలాపొడి వల్ల కూరసూపర్‌గా ఉంది లాంటి ప్రకటనలు చూస్తుంటాం కదూ! అలాంటి వాటిల్లో 'కిచెన్ కింగ్ మసాలా' ఒకటి .** ఇది బయట కొనేకంటే ఇంట్లోనే చేసుకుంటే మరిత తాజాగా ఉంటుంది. ప్రిజర్వేటివ్స్ ఉండవు కనుక ఆరోగ్యానికీ మంచిది. తేలిగ్గా ఎలా చేయాలంటే.. మినపప్పు, పచ్చి శనగ పప్పు, షాహీ జీరా, ఆవాలు ఒక్కో చెంచా చొప్పున, మెంతులు పావు చెంచా,3 సోంపు 2 టేబుల్ స్పూన్లు ధనియాలు 3 టేబుల్ స్పూన్లు, ఒకటిన్నర చెంచా జీలకర్రలను సన్న సెగ మీద వేయించాలి. అవి గోధుమ రంగులోకి మారేసరికి మంచి వాసన వస్తుంది. అందులో అంగుళ చొప్పున దాల్చినచెక్క,శొంఠి, మూడు బిర్యానీ ఆకులు, 12 లవంగాలు, 8 యాలకులు, 2 నల్ల యాలకులు (బ్లాక్ కార్డమమ్), ఒక జాపత్రి, ఒక స్టార్ మొగ్గ, అర జాజికాయ, 7 ఎండు మిరప కాయలు, అర టేబుల్‌స్పూన్ గసగసాలు, 2 టేబుల్ స్పూన్ల చొప్పున మిరియాలు, మెంతి ఆకులు పొడి వేసి ఇంకాస్త వేయించాలి. మంచి సువాసన వస్తున్నప్పుడు దించేచాలి. అవి చల్లారాక..చెంచా చొప్పున పసుపు, ఉప్పు, ఆమ్‌చూర్ పొడి జతచేసి గ్రైండ్ చేయాలి. అంతే.. 'కిచెన్ కింగ్ మసాలా' సిద్ధం. దీనినన తడ లేని గాలి చొరబడని డ్బాలో భద్ర చేసుకుంటే టామాటో, బంగాళదుంప లాంటి కూరల దగ్గర నుంచి బిర్యానీ వరకూ ఎందులో వేసినా వారెవా అనిపిస్తుంది.

## నేడు ఉప్పరపల్లె ఆశ్రమంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

ప్రొద్దుటూరు క్రైం, ఆగస్టు 25, ప్రభాతవార్త:

మండలంలోని ఉప్పరపల్లి క్షేత్రంలో గల శ్రీ సమర్థ నారాయణ ఆశ్రమం మరియు గోశాలలో సోమవారం శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదిన సందర్భంగా సాయంత్రం 4 గంటల నుంచి 8 గంటల వరకు శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు, మరియు గోపూజ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తాదులందరూ తప్పక పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

## నేడు బీజేపీ తరుపున సభ్యత్వ నమోదు కార్యక్రమం

జమ్మలమడుగు, ఆగస్టు 25, ప్రభాతవార్త:

భారతీయ జనతా పార్టీ తరుపున సోమవారం సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టినట్లు జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి తెలిపారు. నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులు తప్పకుండా 8800002024 నంబరుకు మిస్డ్‌కాల్ ఇచ్చి తద్వారా వచ్చిన లింక్ ఓపెన్ చేసి నమోదు చేసుకొని బీజేపీ సభ్యులు కావాలని కోరారు.

## మర్రికుంటపల్లె పంచాయతీలో వీధిలైటు ఏర్పాటు

కలికిరి, ఆగస్టు 25, ప్రభాతవార్త:



మండలంలోని మర్రికుంటపల్లె పంచాయతీ పాత హరిజనవాడ బోడిరెడ్డిగారిపల్లె గ్రామాల్లో ఆదివవార మర్రికుంటపల్లె పంచాయతీ సర్పంచ్ ఎ.రెడ్డిరామ్, కార్యదర్శి గాయత్రిలు వీధిలైట్లు ఏర్పాటు చేశారు. గ్రామాల్లో వీధిలైట్లు మరమ్మతులకు గురి కావడంతో గ్రామస్థులు సర్పంచి దృష్టికి తేవాడంతో స్పందించిన ఆయన రెండు గ్రామాల్లో కొత్త వీధిలైట్లు ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించడం జరిగింది. దీంతో గ్రామస్థులు సంతృప్తి వ్యక్తం చేశారు.

## ప్రతి మహిళ లక్షాధికారి కావడమే ప్రభుత్వ లక్ష్యం

– టీడీపీ మహిళా నేత సిద్దమ్మ




తంబళ్లపల్లె, ఆగస్టు 25, ప్రభాతవార్త:

ప్రతి మహిళా లక్షాధికారి కావడమే తెదేపా కూటమి ప్రభుత్వ లక్ష్యమని మండల తెదేపా మహిళా నేత సిద్దమ్మ ధీమాగా తెలిపారు. ఆదివారం ఎంపీడీవో కార్యాలయంలో కార్యాలయ ఏవో ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో లక్పతి దీదీ కార్యక్రమంలో మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు ఉత్తమారెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం ఐదేళ్లలో రాష్ట్రాన్ని అప్పులు చేసి మహిళలను నిర్వీర్యం చేస్తే మా కకూటమి ప్రభుత్వం చంద్రబాబు సారథ్యంలో ప్రతి మహిళను లక్షాధికారిని చేయడానికి లక్‌పతి దీదీ అనే బృహత్తర కార్యక్రమంతో భవిష్యత్తులో ప్రతి మహిళ ఆర్థికాభివృద్ధి సాధించడం ఖాయమన్నారు. మండల సమాఖ్య అధ్యక్షురాలు రామలక్ష్మమ్మ, తెలుగు యువత నియోజకవర్గ ఉపాధ్యక్షుడు నరసింహులు, మాజీ ఉప సర్పంచ్ రాజన్నలు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో పంచాయతీలకు మహర్దశ పట్టనున్నదని గ్రామ సేవలు అభివృద్ధితో నాటి గాంధీజీ కలలు నిజం కానున్నాయని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పురుషోత్తం, ధనశేఖర్, కాలా నారాయణ, సాంబశివారెడ్డి, సామిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ రామచంద్ర, గట్టుమీద శంకర్‌రెడ్డి, గంగుల్‌రెడ్డి, మండల దివ్యాంగుల అధ్యక్షుడు రామాంజులు, పీర్లమాబు, తెదేపా, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మానవతా సంస్థ సమీక్ష సమావేశం

పీలేరు, ఆగస్టు 25 ప్రభాతవార్తః



పీలేరు మానవత నెలవారి సమీక్ష సమావేశం ఆర్యవైశ్య కళ్యాణమండపం నందు అధ్యక్షులు శెట్టి సుబ్రమణ్యం అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ మానవత చేస్తున్న సేవలు ప్రశంసనీయమని మరింత బలోపేతానికి కషిచేయాలని కోరారు. మానవత ఛైర్మన్ వి.రామచంద్ర మాట్లాడుతూ 2024–25 సంవత్సరానికి సభ్యత్వంగా 325 మంది సభ్యులు చేర్చడం జరిగిందన్నారు. వారిలో 200 పై చిలుకు నూతన సభ్యులుగాను, 120 కుటుంబ సభ్యులుగా చేర్చడం జరిగిందని రూ.2,03,000 బ్యాంకులో జమ చేయడం జరిగిందన్నారు. అలాగే సభ్యత్వ నమోదు కార్యక్రమానికి విశేష కషిచేసిన రాచపల్లె కష్ణమూర్తికి ప్రత్యేక కతజ్ఞతలు తెలిపారు. వినూత్న కార్యక్రమంలో భాగంగా విశ్రాంత ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమం చేయుటకు నిర్ణయించినారు. ఈకార్యక్రమంలో భాగంగా 1998 నుంచి 2020 మధ్య రిటైర్డు అయిన ఉపాధ్యాయులు వివిధ వర్గాల వారిని సన్మానించుటకు ఎంపిక చేయడం దానికి కమిటీలు ఆమోదం చేయడం జరిగింది. ఈకార్యక్రమానికి కమిటీ సభ్యులు,మానవత సభ్యులు శ్రేయోభిలాషులు అందరూ తప్పక హాజరై కార్యక్రమం దిగ్విజయం చేసి సన్మాన కార్యక్రమంలో పాలుపంచుకోవాల్సిందిగా కోరారు. ఈకార్యక్రమంలో పెంజూరి అశోక్, రాజేంద్ర, సుధాకర్‌బాబు, అక్రంబాష, పోతంశెట్టి రమేష్, జీవి.రమణ, రామకష్ణ కన్వీనర్ వై.వెంకటరమణ, హెచ్‌ఎంలు తాతయ్య తదితరులు పాల్గొన్నారు.

## శ్రీభువన విద్యాలయంలో ముందస్తు శ్రీకష్ణాష్టమి వేడుకలు

పీలేరు, ఆగస్టు 25 ప్రభాతవార్తః



పీలేరు– చిత్తూరు జాతీయ మార్గంలోని శ్రీభువన విద్యాలయంలో ముందస్తు శ్రీకష్ణాష్టమి వేడుకలు నిర్వహంచారు. విద్యార్థులు అధిక సంఖ్యలో శ్రీకష్ణుడు, గోపికల వేషదారణలో పాఠశాలకు హాజరైయ్యారు. ఈసందర్భంగా శ్రీ భువన విద్యాలయం విద్యాలయం నిర్వాహకురాలు ఉమా రమాదేవి, ప్రిన్సిపాల్ గుణలక్ష్మి ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఏర్పాటుచేసి పండుగ విశేషాలను విద్యార్థులకు వివరించారు. పాఠశాల ఆవరణంలోని రంగ వేదికపై ఏర్పాటుచేసిన ఉట్లును శ్రీకష్ణుడు వేషదారణలో వచ్చిన చిన్నారులు పగులకొట్టే సన్నివేశాలు అందరిని ఆకట్టుకున్నాయి. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన శ్రీకష్ణ లీల, గోపికల గోల సాంస్కతిక కార్యక్రమాలు అందరిని మంత్రముగ్దులను చేశాయి. విద్యాసంస్థల యాజమాన్యం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు తీర్థ ప్రసాదాలు వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈకార్యక్రమంలో విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## మదర్ థెరిసా పోస్టరు విడుదల

కడప వైద్యవిభాగం, ఆగస్టు 25, ప్రభాతవార్త:



26వ తేదీ కుల మతాలకు అతీతంగా నిస్సహాయకులు పేద ప్రజలకు సేవలందించిన స్వర్గీయ మదర్ థెరిసా జయంతి ఈ సందర్భంగా రాయల్ రషీద్ అసోసియేషన్ వారు తయారు చేసిన మదర్ థెరిసా పోస్టర్లను నగరంలో ఉన్న సీపీ బ్రౌన్ గ్రంథాలయంలో గ్రంథాలయ ఇన్‌ఛార్జి శ్రీమతి ఆచార్య పార్వతి చేతుల మీదుగా మదర్ థెరిసా పోస్టర్లను విడుదల చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో డా.చింతకుంట శివారెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## కడప జిల్లాలో పార్టీని బలోపేతం చేస్తాం

– మాజీ ఎమ్మెల్యే రవిరెడ్డిని సన్మానించిన ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు

కడప కార్పొరేషన్, ఆగస్టు 25, ప్రభాతవార్త:



వైఎస్ఆర్‌సీపీ జిల్లా అధ్యక్షులుగా బాధ్యతలు చేపట్టిన పోచమరెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డిని వైసీపీ ఎస్సీ సెల్ విభాగం జిల్లా అధ్యక్షులు నీ హెచ్.వినోద్ కుమార్ శాలువా కప్పి మెడలో గజమాల వేసి ఘనంగా సన్మానించారు. కేక్ కటింగ్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రవీంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ కడప జిల్లాలో వైసీపీని మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. అందరినీ సమన్వయం చేసుకుంటూ పార్టీని ముందుకు తీసుకెళ్తామని చెప్పారు. కార్యకర్తలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ జిల్లా నాయకులు పులి సునీల్, బండి రమణ, శ్యాంసన్, మేసా ప్రసాద్, కంచుపాటి బాబు, పల్లెకొండు సంపత్, శ్యాం, లారెన్స్, బండి మరియ, రత్నకుమారి, సుశీలమ్మ, మలీశ్వరి పాల్గొన్నారు.

## ఇండ్ల స్థలాల పేరుతో మోసం

మదనపల్లె, ఆగస్టు 25 ప్రభాతవార్త :



ఇళ్ళస్థలాలు ఇప్పిస్తామంటూ మోసం చేశారంటూ ఆదివారం తాలూకా పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేశారు. కోళ్ళబైలు గ్రామం బయ్యారెడ్డి కాలనీలో నివాసం ఉంటున్న చేనేత కార్మికుల వద్ద ఇండ్లస్థలాలు ఇప్పిస్తామని ఒక్కొక్కరి నుంచి రూ.3 నుంచి 4లక్షల వరకు సుమారు రూ.2కోట్లు వరకు వసూలు చేసి మోసం చేశారని ఆ ప్రాంత వాసులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇండ్లస్థలాలు ఇచ్చిన నగదును ఇప్పించి న్యాయం చేయాలని వారు కోరారు. ఈ సందర్భంగా సిఐ కళా వెంకటరమణ బాధితులతో మాట్లాడుతూ మోసం చేసిన వారిని పిలిపించి విచారించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

## విషజ్వరాల నియంత్రణకు చర్యలు తీసుకోండి

ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి

మదనపల్లె, ఆగస్టు 25 ప్రభాతవార్త :



డెంగ్యూ, మలేరియా లాంటి విషజ్వరాల నియంత్రణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ డిమాండ్ చేశారు. ఆదివారం ఎస్టీయూ కార్యాలయంలో ఏఐటియుసి నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో డెంగ్యూ, మలేరియా లాంటి విషజ్వరాల బారిన పడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వృద్దులు, పిల్లలకు, రక్తకణాలు తగ్గిపోయి తిరుపతి, బెంగుళూరు లాంటి కార్పోరేట్ ఆసుపత్రులను ఆశ్రయించి అప్పులు పాలు అవుతున్నారన్నారు. ప్రభుత్వం హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించి జ్వరాల బారిన పడిన వారిని కాపాడాలన్నారు. పట్టణం, గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు మెరుగుపరిచి తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జ్వరాల బారిన పడిన వారిని ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాలు దోచుకొంటున్నారన్నారు. ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో మందుల కొరత లేకుండా, వైద్యసిబ్బంది అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో నాయకులు రెడ్డప్ప, తిరుమల, ముబారక్, మురళీ, రవి తదితరులు పాల్గొన్నారు.

## మదనపల్లెలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు

మదనపల్లె, ఆగస్టు 25 ప్రభాతవార్త :



పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు పరిష్కారానికి పోలీసులు చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఆదివారం మదనపల్లె అభివృద్ధి వేదిక నాయకులు హరిశర్మ, క్రిష్ణమూర్తులతో కలసి ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్య రోజురోజుకు జఠిలం అవుతోందని దీంతో ప్రమాదాలు కూడా నిత్యం జరుగుతున్నాయన్నారు. పట్టణంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా వాహనాల సంఖ్య పెరిగిందన్నారు. రోడ్లు విస్తరణ లేకపోవడంతో ట్రాఫిక్ సమస్య తీవ్ర మైందన్నారు. పట్టణంలో రోడ్లు ఆక్రమణలకు గురికావడం వల్లే సమస్య ఏర్పడందన్నారు. సబ్‌కలెక్టర్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ అడ్వయిజర్ కమిటీ సమావేశం నిర్వహించి వెంటనే ట్రాఫిక్ సమస్యకు చర్యలు తీసుకోవాలన్నారు. ట్రాఫిక్ పోలీస్ సిబ్బందిని పెంచి సమస్యను పరిష్కరించాలన్నారు. పట్టణంలో ట్రాఫిక్‌సమస్య నివారణకు సిగ్నల్స్ లైట్లు ఏర్పాటు చేయాలన్నారు.

## మాజీ సైనికుల సంఘం అధ్యక్షులుగా కంచెర్ల శ్రీనివాసులు

మదనపల్లె, ఆగస్టు 25 ప్రభాతవార్త :



మాజీ సైనికుల సంఘం అధ్యక్షులుగా కంచెర్ల శ్రీనివాసులునాయుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం పట్టణంలోని కమ్మవీధిలో ఉండే శుభం కళ్యాణ మండపంలో మాజీ సైనికుల నూతన కార్యవర్గ కమిటీ ఎన్నిక జరిగింది. ఉపాధ్యక్షులుగా లక్ష్మినారాయణ, జనరల్ సెక్రటరీగా వెంకటస్వామి, సెక్రటరీగా సుబ్బరాయుడు, ట్రెజరర్‌గా ప్రతాప్‌రెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. ఎన్నికల అధికారిగా చిత్తూరుజిల్లా మాజీ సోల్జర్‌బోర్డు అధికారి అయిన లెఫ్టినెంట్‌కల్నన్ బాషా, ఉప ఎన్నికల అధికారిగా సుబేదార్ రామ్మూర్తిలు వ్యవహరించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు మాట్లాడుతూ మాజీ సైనికుల సమస్యలను పరిష్కారానికి చర్యలు తీసుకొంటామన్నారు. మదనపల్లె జిల్లా అయిన తరువాత కావాల్సిన సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకొంటామన్నారు.

## ఉపాధి హామీలో మల్బరీ సాగుపై దృష్టి సారించండి

తంబళ్లపల్లె, ఆగస్టు 25, ప్రభాతవార్త:

తంబళ్లపల్లె మండలంలో రెండు దశాబ్దాల క్రితం మల్బరీ సాగులో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మొదటి స్థానంలో నిలిచిన విషయం తెలిసిందే. కాలక్రమేనా మం డలంలో మల్బరీ సాగులో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మొదటి స్థానంలో నిలిచిన మల్బరీ సాగుపై రైతులు ఆసక్తి చూపకపోవడం సంబం ధిత అధికారులు సైతం ప్రోత్సహించకపోవడంతో మల్బరీ సాగు డీలా పడింది. అప్పటి టీడీపీ ప్రభుత్వంలో మండలంలోని కోసువారిపల్లె, కన్నె మడుగు పంచాయతీలలో మల్బరీ సాగులో జపాన్ శాస్త్రవేత్తల సలహాలతో దేశవాళీ పట్టు పురుగుల పెంపకంతో రాష్ట్ర సిరికల్చర్ అధికారులనే రప్పించిన ఘనత ఉంది. తదనంతరం వర్షాభావంతో మల్బరీ తోటలు కనుమరుగై పట్టించుకునే నాథుడే కరవయ్యారు. నేడు రాష్ట్ర ప్రభుత్వం మల్బరీ సాగు అభివృద్ధి చెంది పూర్వ వైభవం సంతరించుకోవడానికి ఉపాధి హామీ ద్వారా మల్బరీ రైతులకు పలు రాయితీలు ప్రకటించింది. ఇప్పటికైనా మండలంలోని మల్బరీ రైతులు సిరికల్చర్ పంట సాగుపై దృష్టి సారించి పూర్వవైభవం తీసుకొస్తారని ఉపాధి హామీ అధికారులు ఆకాంక్షిస్తున్నారు.

## వేణుగోపాల్ స్వామి దేవాలయంలో అన్నదానం

పెనగలూరు, ఆగష్టు25, ప్రభాతవవార్త :

మండల కేంద్రంలోని వేణుగోపాల్ స్వామి దేవస్థానంలో శ్రీకృష్టాష్టమి సందర్భంగా కొత్త పెద్ద కృష్ణయ్య కుటుంభం స్వామికి అభిషేకం చేయించడం జరుగుతుంది. అలాగే కొత్త బాలక్రిష్ట కుటుంభం అభిషేకం చేయించడం జరుగుతుంది. వారిరువురు కలసి భక్తులకు, ప్రజలకు అన్నదాన కార్యక్రమము జరిపంచబోతున్నారు. కావునా చుట్టుప్రక్కల గ్రామ ప్రజలు విరివిగా పాల్గొని స్వామి వారి కరుణా కటాక్షాలు పొంది అన్నప్రసాదాలు తీసుకు వెళ్లాల్సిందిగా వారు తెలిపారు.

## శిల్పారామంలో అదరగొట్టిన చిన్నారులు

కడప కార్పొరేషన్, ఆగస్టు 25, ప్రభాతవార్త:



సాయంకాలపు సమయంలో కడప శిల్పారామంలో చిన్నారులు తమ స్టెప్పులతో అదరగొట్టారు. ఆదివారం కడప శిల్పారామంలోని శిల్ప కళావేదికపై మిస్బా మూవీ పద్మాకర్ ఆధ్వర్యంలో కడప నగరానికి చెందిన అఖిల్ డ్యాన్స్ అకాడమీ చిన్నారులు సినీ నృత్యాలతో కడప వాసులను అలరించారు. సినీ డ్యాన్సు, సాంస్కృతిక నృత్యాలతో వీక్షకులను అలరించారు. శిల్పారామం పరిపాలనాధికారి పి.శివప్రసాద్‌రెడ్డి పర్యవేక్షించారు.

## ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

కడప వైద్యవిభాగం, ఆగస్టు 25, ప్రభాతవార్త:




బిల్టప్ సర్కిల్ విజయ దుర్గమ్మ ఆలయం పక్కన గల నారాయణ పాఠశాలలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి ఏజీఎం చెన్నకేశవరాజు హాజరై కృష్ణాష్టమి వేడుకల గురించి ప్రసంగించారు. హానరబుల్ గెస్ట్ ఆర్ఐ రామకృష్ణ శర్మ మాట్లాడుతూ కృష్ణుని గురించి కొన్ని విషయాలు పిల్లలతో మాట్లాడి కొన్ని భవిష్యత్తును గురించి ముచ్చటించారు. కార్యక్రమంలో చిన్నారులు కృష్ణుడు, గోపిక వేషధారణలు ప్రదర్శనలు ఇచ్చారు. తల్లిదండ్రులందరూ చిన్నారులను ప్రోత్సహించడం జరిగింది. కార్యక్రమంలో ప్రిన్సిపల్ కల్పన, కోఆర్డినేటర్ జెరూషా, ఏవో రవికాంత్, ఏడీ తాజుద్దీన్, వైస్ ప్రిన్సిపల్ మౌనిక, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పేదలకు బిర్యాని ప్యాకెట్లు పంపిణీ

కడప వైద్యవిభాగం, ఆగస్టు 25, ప్రభాతవార్త:



కడప నగరంలోని పాత కలెక్టరేట్ దగ్గర గల ఫుట్‌పాత్‌పై ఉన్న పేదలకు మౌలానా ఎడ్యుకేషనల్ అండ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు షేక్ అబ్దుల్ షబ్బీర్ జన్మదినం సందర్భంగా బిర్యానీ ప్యాకెట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎపేదలకు ప్రతి ఒక్కరూ ఆదుకోవాలన్నారు. ఇటువంటి పుణ్య కార్యక్రమం నిర్వమించినందుకు తన అదృష్టంగా భావిస్తూ, మనసుకు ప్రశాంతత లభించిందని తెలిపారు. తమ జన్మదినాలలో సేవా కార్యక్రమాలు నిర్వహించి సమాజంలో ఉత్తమ సేవలు అందించాలన్నారు. చిన్ననాటి నుంచి సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరుతూ చిన్నారుల చేతుల మీదుగా పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలోచిన్నారులు నజీముద్దీన్, సర్పరాజ్ అలీ పాల్గొన్నారు.

## 27న ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజాదర్బార్ కార్యక్రమంలో పాల్గొననున్న ఎమ్మెల్యే

పీలేరు, ఆగస్టు 25 ప్రభాతవార్తః



తెదేపా అధినేత నారా చంద్రబాబునాయుడు ఆదేశానుసారం విజయవాడ తెదేపా కేంద్ర కార్యాలయంలో ప్రజా సమస్యలను పరిష్కరించదానికి ప్రజా దర్బార్ కార్యక్రమంలో మరోసారి అవకాశం వచ్చిందని తెదేపా జాతీయ కార్యదర్శి , పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి అన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఐదేళ్లుగా ప్రజా సమస్యలు పడకేసాయని ప్రభుత్వ సొమ్ము విచ్చల విడిగా దుర్వినియోగం చేస్తూ అధికారాన్ని అడ్డం పెట్టుకుని ప్రభుత్వ ఆదాయ వనరుల్ని దోచుకోవడం, పేదల భూములపై పెత్తనం చెలాయించడం వారిని హింసించడం, వారిపై దాడికి పాల్పడటం లాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతూ రాష్ట్రంలో వ్యవస్థలను చిన్నా భిన్నం చేశారన్నారు. వీటన్నింటికి పరిష్కారం చూపేందుకు సీఎం నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం ప్రజా దర్బార్ కార్యక్రమంలో సమస్యలు పరిష్కరించడానికి కట్టుబడి ఉందన్నారు. కార్మిక, పరిశ్రమలు, భీమా, వైద్యసేవలు మంత్రి వర్యులు వాసం శెట్టి సుభాష్ గారితో పాటు ఈనెల 27న మంగళగిరి తెదేపా కార్యాలయ కార్యక్రమంలో పాల్గొననున్నట్లు ఎమ్మెల్యే ఒప్రకటనలో తెలిపారు.

## ఘనంగా గంగమ్మ తల్లి వార్షికోత్సవం



జమ్మలమడుగు, ఆగస్టు 25, ప్రభాతవార్త:

మండల పరిధిలోని పెద్దదండ్లూరు గ్రామ సమీపంలోని పెన్నానది ఒడ్డున వెలసిన శ్రీ గంగమ్మ తల్లి వార్షికోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామ ప్రజలు 108 బిందెలతో అమ్మవారికి జలాభిషేకం చేశారు. గ్రామానికి చెందిన జయచంద్ర అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు చేశారు. గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది.

## కృష్ణాష్టమి పర్వదినం సందర్భంగా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం రద్దు

– జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు

జమ్మలమడుగు, ఆగస్టు 25, ప్రభాతవార్త:

ఆగస్టు 26 సోమవారం కృష్ణాష్టమి పండగ సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో జరగనున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

## నేడు పట్టాబిరామ దేవాలయ ధ్వజ ప్రతిష్టా మహోత్సవం



బద్వేలు, ఆగస్టు 25(ప్రభాతవార్త):

గోపవరం మండల చెన్నవరం గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీశ్రీశ్రీపట్టాబిరామస్వామి ఆలయంలో సోమవారంధ్వజ ప్రతిష్టా మహోత్సవం ని ర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 26 నుంచి 28వ తేది వరకు జరుగు ఈకార్యక్రమాలు 26వ తేది పూజా కార్యక్రమాలతో పాటు అన్నదాన కార్యక్రమం, 27వ ఏది గ్రామోత్సవం మరియు అన్నదాన కార్యక్రమం,రాత్రి 7 గంటలకు శ్రీ కృష్ణ కోలాటము, 28వ తేదిన స్వామివారి విగ్రహ ప్రతిష్ట మరియు కళ్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపార. ఈ పూజా కార్యక్రమంలో తంగి సత్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు.

**పాస్‌పోర్ట్ పోయినది**

షేక్ మహబూబ్‌జాన్, భర్త షేక్ మహబూబ్ బాషా, 1/90–సి, లాలాస్ట్రీట్, లక్కిరెడ్డిపల్లి (మండల్ అండ్ విలేజ్), అన్నమయ్య జిల్లా – 516257. పాస్‌పోర్ట్ నెంబర్ : N9455810 గల పాస్‌పోర్ట్ పోయినది. దొరికినచో ఈ క్రింది నెంబర్‌కు ఫోన్ చేసి ఇవ్వగలరు. 9676177169.

# పెద్దకొమెర్లలో గ్రామసభ

**జమ్మలమడుగు, ఆగస్టు 25, ప్రభాతవార్త:**



జమ్మలమడుగు నియోజకవర్గం మైలవరం మండలం పెద్దకొమెర్ల గ్రామంలో ఆదివారం గ్రామ సభ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు జమ్మలమడుగు నియోజకవర్గం ఎమ్మెల్యే సి.ఆదినారాయణరెడ్డి ఆదేశాల మేరకు పెద్దకొమెర్ల గ్రామ సర్పంచ్ అభ్యర్థి బీజేపీ వెంకటరెడ్డి, రేషన్ డీలర్, ఇల్లూరు కృష్ణారెడ్డి, ఇల్లూరు వెంకటరెడ్డి, మరియు మైలవరం మండల రెవెన్యూ అధికారులు సీఐ గోపాల్‌రెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు గ్రామ సభ వవిజయవంతంగా నిర్వహించామని పెద్దకొమెర్ల గ్రామాభివృద్ధి చేస్తామని తెలిపారు.

# పొలతల ఈవోగా బాధ్యతలు తీసుకున్న కృష్ణ నాయక్

**పెండ్లిమర్రి, ఆగస్టు 25, ప్రభాతవార్త:**



పెండ్లిమర్రి మండలం గంగనపల్లె పంచాయతీ పొలతల క్షేత్రంలో శ్రీ మల్లేశ్వర స్వామి దేవస్థానం ఈవోగా కృష్ణ నాయక్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని ఆలయ ప్రాంగణంలో ఎక్కడా పారిశుద్ధ్య లోపం లేకుండా అన్ని ప్రాంతాలను శుభ్రం చేస్తున్నామని వ్యర్థ పదార్థాలనఉ ఎక్కడపడితే అక్కడ వేయకూడదని వాటికి చెత్త బుట్టలను ఏర్పాటు చేశామన్నారు. మల్లేశ్వర స్వామి దేవస్థానం ఆలయంలో ప్లాస్టిక్ కవర్లను నిషేధించడం జరిగిందని ఎవరూ ప్లాస్టిక్ కవర్లు తీసుకురాకూడదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీకృష్ణాష్టమి సందర్భంగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక తాత్కాలిక రద్దు

**- జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి**

**రాయచోటి, ఆగస్టు 25, ప్రభాతవార్త:**

ఈనెల 26 సోమవారం జరగనున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమాన్ని కృష్ణాష్టమి సందర్భంగా తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు విషయాన్ని గమనించి జిల్లా కలెక్టరుకు రావద్దని కలెక్టర్ పేర్కొన్నారు.

# ఆలయాల్లో చోరీకి పాల్పడిన దుండగులు

**పీలేరు, ఆగస్టు 25 ప్రభాతవార్త:**



పట్టణంలోని బండ్లవంక ప్రాంతంలో గుర్తు తెలియని దుండగులు రెండు ఆలయాల్లో చోరీకి పాల్పడినట్లు స్థానికులు తెలిపారు. శనివారం రాత్రి స్థానిక బండ్లవంకలోని నడివీధి గంగమ్మ ఆలయంలోను, సమీపంలోని ఉన్న యల్లమ్మ గుడిలోను చోరీలు జరిగాయి. ఈసందర్భంగా దుండగులు ఆలయాల్లోని హుండీలను దుండగులు పగులకొట్టి భక్తులు అమ్మవార్లకు సమర్పించిన కానుకలను దోచుకు వెళ్లినట్లు స్థానికులు ద్వారా తెలుస్తోంది. ఈసందర్భంగా ఆలయాల్లో ఏ మేరకు నష్టం జరిగిందో పోలీసుల విచారణలో తెలియాల్సి ఉంది.

# పచ్చదనంతోనే ఆరోగ్యానికి భద్రత : ఎమ్మెల్యే

**మదనపల్లె, ఆగస్టు 25 ప్రభాతవార్త :**



పచ్చదనంతోనే ఆరోగ్యానికి భద్రత కల్పిస్తుందని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. ఆదివారం పట్టణంలోని రెడ్డీస్ కాలనీ ఎక్స్‌టెన్షన్‌లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించుకోవాలన్నారు. మొక్కలు విరివిగా పెంచడం వల్ల కాలుష్యాన్ని నియంత్రించవచ్చునన్నారు. కాలుష్యం పెరిగితే మానవ మనుగడే ప్రమాదకరంగా ఉంటుందన్నారు. మొక్కలు నాటి పరిరక్షించాల్సిన బాధ్యత కూడా ప్రతి ఒక్కరూ తీసుకోవాలన్నారు. కొత్తగా ఇండ్లు నిర్మించే వాటివద్ద కూడా మొక్కలు పెంచాలన్నారు. అనంతరం మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో 45మంది మహిళలకు చిన్న చిన్న పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవడానికి గానూ రూ.2.88కోట్లు చెక్కును ఎమ్మెల్యే పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందినపుడే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ ప్రమీళ, నాయకులు జేసిబి మధు, రైస్‌మిల్ శశి, సుధాకర్, రమేష్, గాంధీ, రామ్మూర్తినాయుడు, సిమెంటు రమణ, డ్యాన్స్ రెడ్డప్ప తదితరులు పాల్గొన్నారు.

# నిరసన ర్యాలీలో అమీర్‌బాబు

**కడప వైద్యవిభాగం, ఆగస్టు 25, ప్రభాతవార్త:**



కడప నగరంలోని ముస్లిం మైనార్టీ మత గురువులు, నాయకులతో కలిపి పెద్ద ఎత్తున నిరసన ర్యాలీ చేపట్టడం జరిగింది. ఈ నిరసన కార్యక్రమంలో తెదేపా ఉపాధ్యక్షులు వి.ఎస్.అమీర్‌బాబు పాల్గొన్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ మహమ్మద్ ప్రవక్తపై రామగిరి బాబా చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ ఈ భారీ నిరసన ర్యాలీ కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. రామగిరి బాబాపై కేసు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నజీర్ అహ్మద్ బాబు బాయ్, బౌద్దాది, మన్సూర్ అలీఖాన్, ఆరీఫుల్లా, జిలాన్, అహ్మద్ బాషా, వామీర్, నయీం, నాజర్ అలీ, మత పెద్దలు, గురువులు, హిమాంలు, స్థానిక ముస్లిం మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

# చిదంబర్‌రెడ్డిని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

**రాయచోటి, ఆగస్టు 25, ప్రభాతవార్త:**



సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు చిదంబర్‌రెడ్డిని ఆదివారం వైఎస్‌ఆర్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి పరామర్శించారు. ఆదివారం సంబేపల్లె మండలం గుట్టపల్లెలోని వారి నివాసంలో చిదంబర్‌రెడ్డిని డీసీఎంఎస్ మాజీ ఛైర్మన్ ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డి, రాయలసీమ విద్యా సంస్థల అధినేత ఆనందరెడ్డి, బసిరెడ్డి, మండల జేసీఎస్ కన్వీనర్ వడ్డీ వెంకటరమణారెడ్డి, వైస్ ఎంపీపీ పొత్తూరి రవీంద్ర నాయుడులతో కలిసి శ్రీకాంత్‌రెడ్డి కలిశారు. గ్రామ సమస్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు రాళ్లపల్లె రవీంద్రనాయుడు, గుది శివ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# పాలకొండ దేవస్థానం కమిటటీ మెంబరుకు వడ్డెరుల ఘన సన్మానం

**కడప వైద్యవిభాగం, ఆగస్టు 25, ప్రభాతవార్త:**

కడప నగర శివార్లలో ఉన్న పవిత్ర పుణ్యక్షేత్రమైన పాలకొండ దేవస్థానం కమిటీ మెంబర్ ఒర్సు రమణయ్యకు వడ్డెర సంఘం నాయకులు ఆదివారం సాయంత్రం సబ్ జైలు సమీపంలోని శ్రీరామ్‌నగర్ రామాలయంలో ఘనంగా సన్మానం చేశారు. టీడీపీ ప్రభుత్వం వడ్డెరులకు సముచిత స్థానం కల్పించినందుకు సంఘం నాయకులు ధన్యవాదాలు తెలిపారు.

# రౌడీషీటర్ల, ట్రబుల్ మాంగ్లర్లకు కౌన్సెలింగ్

**- అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు**



**కడప క్రైం, ఆగస్టు 25, ప్రభాతవార్త:**

జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు ఆదివారం తెల్లవారుజామున జిల్లా వ్యాప్తంగా పలు పీఎస్‌ల పరిధిలో పోలీసు అధికారులు, సిబ్బంది కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ తనిఖీలో రికార్డులు లేని 86 ద్విచక్ర వాహనాలు, 3 కార్లు, 8 ఆటోలు, స్వాధీనం చేసుకున్నామని పోలీసు అధికారులు తెలిపారు. రౌడీషీటర్లకు, ట్రబుల్ మాంగ్లర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మహిళలు ఆర్థికంగా ఎదిగి జీవన ప్రమానాలను మెరుగుపరుచుకోవాలి

**చిన్నమండెం, ఆగస్టు 25, ప్రభాతవార్త :**




మహిళలు అన్ని రంగాలలో రాణించి ఆర్థికంగా ఎదిగి జీవన ప్రమానాలను మెరుగుపరుచుకోవాలని రాష్ట్ర రవాణా, యువజన క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సతీమణి హరితమ్మ అన్నారు. ఆదివారం మండలంలోని మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో మండల అధ్యక్షురాలు రమణమ్మ ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి లఖ్ పతి దీదీల కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హరితమ్మ హాజరైయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోడీ నేడు మహారాష్ట్రలో వర్చ్యువల్ పద్దతిలో అజీవిక, లఖ్‌పతి దీదీని దేశమంతటా ప్రారంభించడం జరిగిందన్నారు. దేశ ప్రధాని, రాష్ట్ర ముఖ్యమంత్రిలు మహిళల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. మహిళా అభివృద్ధి కార్యక్రమాలు విరివిగా ఇస్తున్నారని తెలిపారు. ఈ పథకాలన్నింటిని సంఘ సభ్యులు వినియోగించుకోవాలని, తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని తెలిపారు. ప్రతి మహిళ టైలరింగ్ లేదా పాడి, చేతివృత్తులు, కొత్త ఉత్పత్తుల తయారీ చేసి ఆర్థిక అభివృద్ధి చెందాలని సూచించారు. సభ్యులకు పొదుపు, అప్పులు గ్రామ సమాఖ్యలో సిఐఎఫ్ జెండర్, ఉన్నతి, స్త్రీ నిధి, బ్యాంకు రుణాలు, సబ్సిడీ స్కీంలు, తక్కువ వడ్డీ రుణాలు ఇవ్వడం జరుగుతుందని, ప్రతి ఒక్కరు అన్ని పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, తీసుకొన్న రుణాలు తిరిగి సకాలంలో చెల్లించాలని తెలిపారు. అనంతరం సంఘ సభ్యులను సన్మానించి సిఆర్‌పిఎస్, లఖత్ పతి దీదీలకు సర్టిఫికెట్‌లను పంపిణీ చేశారు. అలాగే బ్యాంకు లింకేజీ మేగా చెక్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎపిఎం, సిసిఎస్, విఓలు, మహిళలు పాల్గొన్నారు.

# మానవత సేవలు మరింత విస్తృతం చేస్తాం



**వేంపల్లె, ఆగస్టు 25, ప్రభాతవార్త :**

మానవత స్వచ్ఛంద సంస్థ సేవలు మరింత విస్తృతం చేస్తామని ఛైర్మన్ బి.చక్రపాణిరెడ్డి అన్నారు. వేంపల్లె మండల శాఖ మాసాంత సమావేశం ఆదివారం శ్రీచైతన్య హైస్కూల్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఛైర్మన్ చక్రపాణిరెడ్డి మానవత సంస్థ నందు 40మందికి సభ్యత్వం నమోదు చేయించి అధ్యక్షులు పోతిరెడ్డి శ్రావణ్‌కుమార్‌కు అందించారు. డాక్టర్ అరుణ్ 10మందికి, ఆలుమూరి శివ 10రికి సభ్యత్వం నమోదు చేయించారు. ఈ కార్యక్రమంలో కన్వీనరు రంగారెడ్డి, రీజనల్ ఛైర్మన్ బాలాజి, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# భయబ్రాంతులకు గురిచేసే సాంప్రదాయానికి స్వస్తి పలకాలి



**వేంపల్లె, ఆగస్టు 25, ప్రభాతవార్త :**

రాష్ట్రంలో ప్రజలను భయబ్రాంతులకు గురిచేసే సాంప్రదాయానికి స్వస్తి పలకాలని వైఎస్‌ఆర్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.వి.సతీష్‌రెడ్డి అన్నారు. వేంపల్లెలోని తన స్వగృహంలో ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుంటే ప్రజల తరపున పోరాటం చేస్తామని వెల్లడించారు. వైఎస్‌ఆర్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సతీష్‌రెడ్డిని నియమించినందుకు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆయన స్వగృహం వద్దకు చేరుకుని శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. అనంతరం భారీ కేకు కత్తిరించి సతీష్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ ఓడిపోలేదని, కేవలం చంద్రబాబునాయుడు ఇచ్చిన అపద్దపు హామీలు నమ్మి ప్రజలు కూటమి పార్టీలకు ఓటు వేసి గెలిపించారన్నారు. పులివెందుల నియోజకవర్గం అభివృద్ధికి తాము ఎల్లవేళలా ముందుండి సహకరిస్తామన్నారు. ప్రజలు అధికారం ఇచ్చింది సేవ చేయడానికి మాత్రమేనని, ధనార్జన, అక్రమార్జన లక్ష్యంగా దోచుకోవడానికి కాదని ఆయన అన్నారు. ఇచ్చిన హామీలు నెరవేర్చుతామా లేదా అని సీఎం చంద్రబాబు అసెంబ్లీ సాక్షిగా చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పులివెందుల నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేశారన్నారు. పులివెందులలో మెడికల్ కాలేజి, వేంపల్లెలో ఉర్దూ కళాశాల, పట్టణ సుందరీకరణ, పార్కు, ఫైర్‌స్టేషన్, జడ్పీ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలు, తదితర అభివృద్ధి పనులు చేశారన్నారు. నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి గురించి ఆయన వివరించారు. అభివృద్ధి అంటే ఇసుక అమ్ముకోవడం కాదన్నారు. ఇప్పటికైనా ఇలాంటి సాంప్రదాయాలకు స్వస్తి పలికి, పులివెందుల నియోజకవర్గం అభివృద్ధికి పాటు పడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు రవికుమార్‌రెడ్డి, మండల కన్వీనరు చంద్ర ఓబుళరెడ్డి, ఎంపీపీ లక్ష్మిగాయత్రి, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

**పులివెందుల, ఆగస్టు 25, ప్రభాతవార్త :**



ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు తమ వంతు కృషి చేస్తున్నట్లు పట్టభద్రుల ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం పులివెందులలోని తన స్వగృహంలో ఆయన ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఆయనను కలిసి సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రాలు సమర్పించారు. ఉపాధి అవకాశాలు కల్పించాలని, సీఎం సహాయ నిధి మంజూరు చేయించాలని ప్రజలు ఆయనను కోరారు. అలాగే పులివెందుల అర్బన్ సీఐ జీవన్ గంగాధర్‌బాబు ఎమ్మెల్సీని మర్యాదపూర్వకంగా కలిశారు.

# నేత్రదానం ఒక సాంప్రదాయంగా అలవరచుకోవాలి

**- మాజీ ఎమ్మెల్సీ మారెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి**



**పులివెందుల, ఆగస్టు 25, ప్రభాతవార్త :**

నేత్రదానం ఒక సాంప్రదాయంగా అలవరచుకోవాలని పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్సీ మారెడ్డి రవీంద్రనాథరెడ్డి అన్నారు. జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు 2024 పోస్టర్లను ఆదివారం పులివెందులలో మాజీ ఎమ్మెల్సీ మారెడ్డి రవీంద్రనాథరెడ్డి, తొండూరు టీడీపీ నాయకులు శివమోహన్‌రెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తూగుట్ల మధుసూధన్‌రెడ్డి, తదితరులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోకాన్ని చూడలేక చీకటి ప్రపంచంలో మగ్గుతున్న అంధులకు వెలుగులు నింపే నేత్రదానం అనే బృహత్కార్యం దేవుడు మనిషి ఇచ్చిన గొప్ప వరం అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, స్నేహిత అమృతహస్తం సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

**- పులివెందుల రూరల్ :**

పులివెందులలోని డీఎస్పీ కార్యాలయంలో ఆదివారం స్నేహిత అమృతహస్తం సేవా సమితి నేత్ర సేకరణ కేంద్రం ఆధ్వర్యంలో జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు 2024 పోస్టర్లను సీఐ జీవన్ గంగాధర్ బాబు, రూరల్ సీఐ రమణ, పట్టణ ఎస్సై నారాయణలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మరణానంతరం మట్టిలో కలిసిపోయే నేత్రాలను దానం చేయడం వల్ల అంధత్వం దూరం చేయవచ్చని తెలిపారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# అమృత్‌నగర్‌లో నాకాబందీ

**ప్రొద్దుటూరు క్రైం, ఆగస్టు 25, ప్రభాతవార్త:**

జిల్లా ఎస్పీ ఉత్తర్వుల మేరకు ప్రొద్దుటూరు డీఎస్పీ భక్తవత్సలం ఆదేశాల మేరకు రూరల్ సీఐ మద్దిలేటి ఆధ్వర్యంలో ఆదివారం అమృత్‌నగర్‌లో నాకా బందీ నిర్వహించారు. సరైన పత్రాలు లేని 45 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అలాగే ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ మద్దిలేటి, యుగంధర్, దేవ కిరణ్, గోవిందరెడ్డి, రామకృష్ణారెడ్డి, టౌన్ ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

# మహిళల ఆర్థికాభివృద్దే ప్రధాని ధ్యేయం



**బ్రహ్మంగారిమఠం, ఆగస్టు 25(ప్రభాతవార్త):**

దేశంలో ఉన్న మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పెట్టుకుని కేంద్రప్రభుత్వం లక్‌పథ్ దిది అనే కార్యక్రమం ప్రవేశపెట్టారని మండల వెలుగు పథకం ఏపీఎం ప్రకాష్‌రావు అన్నార. ఆదివారం స్థానిక స్వయం సహాయక సంఘాల భవనం నందు మండలంలోని డ్వాక్రా సంఘాల భవనం నందు గ్రూప్‌లకు సమావేశాన్ని ఏర్పాటు చేసి ప్రధాని ప్రవేశపెట్టిన లక్‌పథ్ దిది కార్యక్రమం గురించి వివరించారు. ఈ ప్రొగ్రామ్‌ను దేశంలోని మహిళలకు సోషల్ మీడియా ద్వారా సందేశాన్ని పంపారన్నారు. అనంతరం వీడియోను అందిరికీ చూపిస్తూ వారికి తెలుగులో అర్థమయ్యేలా వివరణ ఇచ్చారు..అనంతరం డ్వాక్రా సంఘాల మహిళలకు సర్టిఫికెట్లు అందించారు. సమావేశంలో కమ్యూనిటి కోఆర్డినేటర్ నారాయణరావు, సుబ్బరాయుడు, బాలయ్య, ఏవోలు, గ్రూపు లీడర్లు పాల్గొన్నారు.





